వాణిజ్య సిలిండర్ రూ.39 పెంపు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1: వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కిలోల సిలిండర్ ధరపై కేంద్రం రూ.39 పెంచింది. దీంతో హైదరాబాద్‌లో వాణిజ్య సిలిండర్ ధర రూ.1,919కి చేరుకుంది. మరోవైపు విమాన ఇంధన ధర కిలోలీటరుకు రూ.4,495 (4.58 శాతం) తగ్గించింది. దీంతో న్యూఢిల్లీలో కిలో లీటర్ ఏటీఎఫ్ ధర రూ.93,480కి తగ్గింది. ప్రభుత్వ చమురు సంస్థలు గృహ వినియోగ వంటగ్యాస్ ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. ప్రస్తుతం 14.2 కిలోల సబ్సిడీ సిలిండర్ ధర హైదరాబాద్‌లో రూ.855గా ఉంది.

పూరీ రత్న భాండార్‌కు బంగారు తలుపులు

పూరీ: ఒడిశాలోని శ్రీ జగన్నాథ దేవాలయంలోని రత్న భాండార్‌లో తలుపులకు రెండు వైపులా బంగారు తాపడం చేయించబోతున్నారు. జగన్నాథుని గురించి విస్తృతంగా ప్రచారం చేయడం కోసం ప్రత్యేకంగా ఓ ఎఫ్‌ఎం రేడియోను కూడా ప్రారంభించబోతున్నారు. శ్రీ జగన్నాథ్ దేవాలయ నిర్వహణ కమిటీ (ఎస్‌జేటీఎంసీ) ఈ నిర్ణయాలను ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.413 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది.

ఆగస్టులో జీఎస్‌టీ వసూళ్లు 1.75 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు ఆగస్టు నెలలో రూ.1.75 లక్షల కోట్లుగా ఉందని కేంద్రం ఆదివారం ప్రకటించింది. గత ఏడాది ఆగస్టుతో పోల్చుకుంటే వసూళ్లు 10 శాతం ఎక్కువగా ఉన్నాయని తెలిపింది. దేశీయ లావాదేవీల ద్వారా స్థూల జీఎస్‌టీ ఆదాయం 9.2 శాతం పెరిగి, రూ.1.25 లక్షల కోట్లకు చేరినట్లు, దిగుమతులపై పన్ను ఆదాయం 12.1 శాతం పెరిగి రూ.49,976 కోట్లకు చేరినట్లు వివరించింది. ఆగస్టులో రిఫండ్స్ రూ.24,460 కోట్లు అని, ఇది గత ఏడాది కన్నా 38 శాతం ఎక్కువ అని తెలిపింది. రిఫండ్స్‌ను సర్దుబాటు తర్వాత నికర జీఎస్‌టీ రెవెన్యూ రూ.1.5 లక్షల కోట్లు అని వివరించింది.

రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో విషాదం.. 11మంది మృతి

రాంచీ: జార్ఖండ్‌లో ఎక్సైజ్ కానిస్టేబుల్ నియామకాల తీరు వివాదాస్పదంగా మారింది. శారీరక దారుఢ్య పరీక్షకు హాజరైన అభ్యర్థుల్లో పలువురు ప్రాణాలు కోల్పోవటం తీవ్ర కలకలం రేపింది. ఆగస్టు 22 నుంచి 30 వరకు వివిధ కేంద్రాల్లో నిర్వహించిన టెస్ట్‌ల్లో 11 మంది అభ్యర్థులు చనిపోయారని జార్ఖండ్ పోలీస్ శాఖ ఆదివారం ప్రకటించింది. మరణాలపై దర్యాప్తు చేపట్టామని ఉన్నతాధికారి అమోల్ వీ హోమ్కార్ తెలిపారు. ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టనందువల్లే పలువురు అభ్యర్థులు ప్రాణాలు కోల్పోయారని విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

మణిపూర్‌లో మళ్లీ హింస

ఇద్దరి మృతి, 9 మందికి గాయాలు

ఇంఫాల్: మణిపూర్‌లో మళ్లీ హింస రేగింది. పశ్చిమ ఇంఫాల్ జిల్లాలో అనుమానిత కుకీ తీవ్రవాదులు ఆదివారం జరిపిన డ్రోన్, తుపాకీ, బాంబు దాడుల్లో ఓ మహిళ సహా ఇద్దరు మరణించారు. గాయపడిన తొమ్మిది మందిని దవాఖానకు తరలించారు. తీవ్రవాదులు కొండలపై నుంచి లోయలోకి విచక్షణారహితంగా కాల్పులు జరిపారని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో కొన్ని ఇళ్లు కూడా దెబ్బతిన్నాయని చెప్పారు. అనుకోకుండా జరిగిన ఈ ఘటనతో గ్రామస్థులంతా సురక్షిత ప్రాంతానికి పరుగులు తీశారని పేర్కొన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేస్తే 50 వేలు

న్యూఢిల్లీ: ఢిల్లీలో ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపర్చడంతోపాటు ట్రాఫిక్ ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు సరికొత్త పథకం ప్రకటించారు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసినవారికి రూ.50 వేలు నజరానాగా ఇవ్వనున్నట్టు తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచే ఇది అందుబాటులోకి వచ్చింది. ఇందుకోసం 'ట్రాఫిక్ ప్రహారీ' యాప్‌లో ట్రాఫిక్ ఉల్లంఘనుల ఫొటోలు, వీడియోలు, వాహనం రిజిస్ట్రేషన్ నంబర్ తదితర సమగ్ర వివరాలు అప్‌లోడ్ చేయాలి.

కోర్టుల్లో వాయిదా సంస్కృతి పోవాలి

- ఓ తరం గడిచాక రేప్ కేసుల్లో తీర్పు
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవేదన
- సుప్రీంకోర్టు కొత్త జెండా, చిహ్నం ఆవిష్కరణ

సుప్రీంకోర్ట్ కొత్త చిహ్నాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్రపతి ముర్ము, సీజేఐ జస్టిస్ చంద్రచూడ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1: రేప్ కేసుల్లో కోర్టు తీర్పులు వెలువడటానికి ఓ తరం పడుతున్నదని, కోర్టుల్లో వాయిదా సంస్కృతి పోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. న్యాయ ప్రక్రియలో సున్నితత్వం లోపించిందన్న భావన సామాన్యుల్లో ఏర్పడిందని చెప్పారు. సత్వర న్యాయం కోసం తగిన కృషి చేయాల్సిన అవసరముందని ముర్ము అభిప్రాయపడ్డారు. జిల్లా న్యాయవ్యవస్థలో పెండింగ్ కేసులు భారీగా పెరిగిపోవటం పెద్ద సవాల్‌గా మారిందని అన్నారు. ఆదివారం జిల్లా న్యాయ వ్యవస్థపై ఏర్పాటుచేసిన సదస్సులో ఆమె ప్రసంగిస్తూ, రేప్ కేసులు సహా అత్యంత హేయమైన నేరాల్లోనూ తీర్పులకు చాలా సమయం పడుతున్నదని, దీనివల్ల బాధితుల్లో సంతోషం మిగలదని ముర్ము అన్నారు. 'పెండింగ్ కేసులను తగ్గించేందుకు పరిష్కార మార్గం వెతకాలి. తరుచూ లోక్ అదాలత్‌లు నిర్వహించాలి' అని చెప్పారు. సుప్రీంకోర్టు ఏర్పాటై 75 ఏండ్లు అయిన సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం నూతన చిహ్నాన్ని, జెండాను రాష్ట్రపతి ఆవిష్కరించారు. అశోక చక్ర, సుప్రీంకోర్టు భవనం, రాజ్యాంగం పుస్తకాలతో కూడిన ఈ జెండాను న్యూఢిల్లీలోని 'నిఫ్ట్' డిజైన్ చేసింది.

జాతీయస్థాయి రిక్రూట్‌మెంట్ అవసరం: సీజేఐ డీవై చంద్రచూడ్

జిల్లా కోర్టుల్లో ఖాళీల భర్తీకి జాతీయస్థాయి రిక్రూట్‌మెంట్ విధానాన్ని తీసుకురావాలని సీజేఐ డీవై చంద్రచూడ్ అన్నారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ, పెండింగ్ కేసుల పరిష్కారానికి నైపుణ్యం కలిగిన సిబ్బందిని ఆకర్షించటం అత్యంత కీలకమని చెప్పారు. దేశవ్యాప్తంగా ఒక నియామక క్యాలెండర్‌ను రూపొందించాల్సిన సమయం వచ్చిందన్నారు. జిల్లా కోర్టులు మొత్తం న్యాయవ్యవస్థకు వెన్నెముక వంటివని అన్నారు. జిల్లా స్థాయిలో జ్యుడిషియల్ ఖాళీలు 28శాతం, నాన్-జ్యుడిషియల్ ఖాళీలు 27 శాతమున్నాయని, పూర్తిస్థాయి సిబ్బంది ఉంటేనే కేసుల సత్వర పరిష్కారానికి అవకాశముంటుందని, ఈ విషయాలన్నింటిపైనా సదస్సులో చర్చించామని సీజేఐ చెప్పారు. కొన్ని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కేసులను క్లియర్ చేయడానికి యాక్షన్ ప్లాన్ చేపట్టామని, 2025లో మూడో దశ చేపడుతున్నామని తెలిపారు. జిల్లా కోర్టుల్లో మౌలిక వసతులు మారాలని, దేశంలో కేవలం 6.7 శాతం కోర్టులు మాత్రమే మహిళలకు అనుకూలంగా ఉన్నాయని సీజేఐ ఆందోళన వ్యక్తం చేశారు.

కేరళ కాంగ్రెస్‌లో క్యాస్టింగ్ కౌచ్!

- అధిష్ఠానంతో 'సన్నిహిత' సంబంధాలు ఉన్నవారికే పదవులు
- లేకపోతే వేధింపులు.. సీనియర్ మహిళా నేత తీవ్ర ఆరోపణలు
- పార్టీ నుంచి బహిష్కరణ


రోజ్‌బెల్

తిరువనంతపురం, సెప్టెంబర్ 1: మహిళా నటులపై కొందరు హీరోలు, ఇతర సిబ్బంది లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారంటూ జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదిక ఇప్పటికే మాలీవుడ్‌ను కుదిపేస్తుండగా, తాజాగా ఆ మకిలి కాంగ్రెస్ పార్టీకి కూడా అంటుకుంది. అధినేతలతో 'సన్నిహిత' సంబంధాలు ఉన్న మహిళలకే పార్టీలో అవకాశాలు వస్తాయంటూ, లేకపోతే వేధింపులు తప్పవంటూ ఒక మహిళా కాంగ్రెస్ నేత చేసిన ఆరోపణలు ఆ పార్టీని తీవ్రంగా కుదిపేస్తున్నాయి. దీంతో ఆరోపణలు చేసిన ఆమెను పార్టీ అధిష్ఠానం పార్టీ నుంచి బహిష్కరించడం గమనార్హం.

పార్టీలోనూ అదే పరిస్థితి

'క్యాస్టింగ్ కౌచ్' ఆరోపణలు మలయాళ సినీ పరిశ్రమలో సంచలనం సృష్టించగా, కాంగ్రెస్ పార్టీలో కూడా అలాంటి పరిస్థితే ఉందని, సినీ పరిశ్రమకు అదేమీ తీసిపోదంటూ ఆ పార్టీ సీనియర్ నేత సిమీ రోజ్‌బెల్ జాన్ విమర్శలు చేశారు. తాజాగా ఆమె మీడియాతో మాట్లాడుతూ పార్టీలో చాలా మంది మహిళలు తాము ఎదుర్కొన్న బాధాకరమైన అనుభవాలను తనతో పంచుకున్నారని తెలిపారు. పార్టీకి సంబంధించిన మహిళలపై కొందరు పురుష నేతలు అభ్యంతరకరంగా ప్రవర్తించారని, పదవులు ఆశచూపి కొంతమంది సీనియర్ నేతలు మహిళలను ప్రలోభాలకు గురిచేస్తున్నారన్నారు. వీటికి సంబంధించిన ఆధారాలు తగిన సమయంలో బయటపెడతానని చెప్పారు. తనపై ఫిర్యాదు ఇచ్చిన వారు కూడా దీనిని గమనించాలన్నారు. ఈ సందర్భంగా ఆమె ఎంపీ జేబీ మేథర్ పేరును, మరికొందరి పేర్లను ప్రస్తావిస్తూ పార్టీలో వారికి అనవసర గౌరవాలు దక్కాయని ఆరోపించారు. మహిళా కాంగ్రెస్‌లో ఎనిమిదేళ్ల క్రితమే చేరినప్పటికీ ఆమెను యూత్ కాంగ్రెస్‌కు అఖిల భారత కార్యదర్శిగా నియమిస్తే తామంతా మౌనంగా ఉండిపోయామని అన్నారు. అధిష్ఠానం ఆదేశాలను అనుసరించడానికి నిరాకరించిన మహిళలపై కొందరు నేతలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని ఆమె ఆరోపించారు. అదే సమయంలో కొంత మంది మహిళల పట్ల అలవిమాలిన ప్రేమను కనబరుస్తున్నారని విమర్శించారు. కాగా, ఆమె చేసిన ఆరోపణలపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేయడంతో రోజ్‌బెల్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు కేపీసీసీ తెలిపింది.

నేడు సచివాలయం ఎదుట యూడీఎఫ్ ధర్నా

జస్టిస్ హేమ కమిటీ నివేదిక ప్రకారం లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుండా వారికి రక్షణ కల్పించడానికి కేరళలోని పినరయి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ప్రతిపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఆరోపించింది. సోమవారం సచివాలయం ఎదుట నిరసన వ్యక్తం చేయనున్నట్టు తెలిపింది. ఈ ఆందోళనలో యూడీఎఫ్ కన్వీనర్ ఎంఎం హుస్సేన్, కేపీసీసీ అధ్యక్షుడు కే సుధాకరన్ తదితరులు పాల్గొంటారు.

మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నా: మమ్ముట్టి

మాలీవుడ్‌లో ఇటీవల జరుగుతున్న పరిణామాలపై ప్రముఖ నటుడు మమ్ముట్టి స్పందించారు. మలయాళ చిత్ర పరిశ్రమలో 'పవర్ గ్రూప్' ఉందని జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఈ మేరకు ఫేస్‌బుక్‌లో ఒక పోస్ట్ పెట్టారు. జస్టిస్ హేమ కమిటీని నియమించిన ప్రభుత్వాన్ని ఆయన ప్రశంసిస్తూ కమిటీ చేసిన సిఫార్సులు, చూపిన పరిష్కారాలకు తాను మనస్ఫూర్తిగా మద్దతు తెలియజేస్తున్నానని తెలిపారు.

హేమ కమిటీ గురించి తెలియదు: రజనీకాంత్

కేరళ ఏర్పాటు చేసిన జస్టిస్ హేమ కమిటీ గురించి, అలాంటి కమిటీయే తమిళనాడులో ఏర్పాటు చేయాలన్న డిమాండ్ గురించి తనకు తెలియదని సూపర్‌స్టార్ రజనీకాంత్ తెలిపారు.

రాత్రి విధుల్లో ఉన్న నర్సుపై వేధింపులు

బెంగాల్‌లో మరో దారుణ ఘటన

కోల్‌కతా : ఆర్‌జీ కర్ దవాఖానలో పీజీటీ వైద్యురాలిపై హత్యాచారం యావత్తు దేశాన్ని కుదిపేస్తున్న తరుణంలో పశ్చిమ బెంగాల్‌లో మరో దుర్ఘటన జరిగింది. బీర్‌భూమ్‌లోని ఇలంబజార్ ఆరోగ్య కేంద్రంలో విధి నిర్వహణలో ఉన్న నర్స్‌పై రోగి దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి కథనం ప్రకారం, ఆమె ఈ దవాఖానలోని ఎమర్జెన్సీ వార్డులో శనివారం రాత్రి సేవలందిస్తున్నారు. డాక్టర్ సూచనల మేరకు ఓ రోగికి సెలైన్ పెట్టేందుకు వెళ్లారు. ఆమె ఆ రోగికి సెలైన్ పెడుతుండగా, ఆయన ఆమె ప్రైవేట్ పార్ట్స్‌ను అనుచితంగా తాకాడు. మాటలతో దూషించాడు. ఆ సమయంలో ఆయన కుటుంబ సభ్యులు అక్కడే ఉన్నప్పటికీ, ఆయనను నిలువరించే ప్రయత్నం చేయలేదు. భద్రత లేకపోవడం వల్లే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న దవాఖాన అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

మైనర్ బాలికపై ల్యాబ్ టెక్నీషియన్ వేధింపులు

బెంగాల్‌లోని హౌరాలో ఓ ల్యాబ్ టెక్నీషియన్ అత్యంత నీచానికి తెగబడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, 13 ఏళ్ల బాలిక ఓ దవాఖానలో నిమోనియాకు చికిత్స పొందుతున్నది. ఆమెను శనివారం రాత్రి సీటీ స్కాన్ కోసం తీసుకెళ్లగా ఆ ల్యాబ్ టెక్నీషియన్ ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. నిందితుడు ఈ దవాఖానలో కాంట్రాక్టుపై ఉద్యోగం చేస్తున్నాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

తాత మద్యం సేవిస్తే మనుమలపై దుష్ప్రభావం!

న్యూఢిల్లీ: మద్యపానం దుష్ప్రభావాలు తరతరాలు వెంటాడతాయని అధ్యయనాలు చెప్తున్నాయి. అతిగా మద్యం సేవిస్తే అది మనుమల జీవితాలను కూడా ప్రభావితం చేస్తుందని తెలుస్తున్నది. తాత, తండ్రి వంటి పితృ సంబంధీకులు మద్యపానానికి అలవాటు పడితే, దాని ప్రభావం వారి సంతానం ఆరోగ్యం, ప్రవర్తనలపై పడుతుందని వెల్లడైంది. టెక్సాస్ ఏ అండ్ ఎం విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మైఖేల్ గోల్డింగ్ మాట్లాడుతూ, తల్లిదండ్రులిద్దరూ అతిగా మద్యం సేవించేటట్లయితే, వారి పిల్లలు వేగంగా వృద్ధులవుతారని, వ్యాధులబారిన త్వరగా పడతారని తమ పరిశోధనలో తేలిందన్నారు. అమెరికా దేశంలోని 11 శాతం మంది యువత ఆల్కహాల్ వినియోగ రుగ్మతతో బాధపడుతున్నారు. అతిగా మద్యం సేవించడం వల్ల కాలేయ వ్యాధులు, గుండె సమస్యలు, వేగంగా వృద్ధాప్యం రావడం వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. తల్లిదండ్రులు ఈ ఆరోగ్య సమస్యలను తమ పిల్లలకు వారసత్వంగా అందిస్తారు. గర్భస్థ పిండాలకు ఈ రోగాలు సంక్రమించడం వల్ల టైప్-2 మధుమేహం, గుండె జబ్బులు త్వరగా వస్తాయి.

రూ.10 వేలు ఇస్తేనే కాపాడుతా!

వ్యక్తి ప్రాణం తీసిన గజ ఈతగాడి దురాశ

లక్నో: మనిషి ప్రాణాల కన్నా డబ్బుకే ఎక్కువ విలువ ఇచ్చే దురాశపరుడి వల్ల ఓ వ్యక్తి గంగా నదిలో మునిగి, ప్రాణాలు కోల్పోయారు. మీడియా కథనాల ప్రకారం, ఉత్తర ప్రదేశ్ ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆదిత్య వర్ధన్ సింగ్ ఆదివారం తన మిత్రులతో కలిసి ఉన్నావ్‌లోని నానామావ్ ఘాట్ వద్ద గంగా నదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. అనుకోకుండా ప్రవాహం పెరగడంతో ఆయన నీటిలో మునిగిపోయారు. అక్కడే ఉన్న గజ ఈతగాడు సునీల్ కాశ్యప్ సహాయపడటానికి ముందుకు వచ్చాడు. అయితే ఆన్‌లైన్‌లో రూ.10,000 తనకు బదిలీ అయ్యే వరకు తాను ఆయనను కాపాడబోనని చెప్పాడు. సింగ్ నదిలో కొట్టుకుపోతూ ఉంటే, రూ.10,000 తనకు బదిలీ అయ్యే వరకు సునీల్ వేచి చూశాడు. దీంతో ఆయన నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు.

ఐపీఎస్ అధికారి కుమార్తె అనుమానాస్పద మృతి

లక్నో, సెప్టెంబర్ 1: ఐపీఎస్ అధికారి కుమార్తె, లా విద్యార్థిని ఒకరు హాస్టల్ రూమ్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన యూపీలోని లక్నోలో చోటుచేసుకుంది. ఎన్ఐఏలో ఐజీగా ఉన్న సంతోష్ రస్తోగి కుమార్తె అనికా రస్తోగి (19) లక్నోలోని రామ్ మనోహర్ లోహియా నేషనల్ లా యూనివర్సిటీలో లా మూడో సంవత్సరం చదువుతున్నది. శనివారం రాత్రి ఆమె హాస్టల్ రూమ్‌లోని నేలపై అచేతనంగా పడి ఉండటంతో దవాఖానకు తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్టు డాక్టర్లు ప్రకటించారు. ఆమె మృతికి కారణాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆషియానా పోలీసులు తెలిపారు.

హైదరాబాద్ వస్తున్న విమానానికి బాంబు బెదిరింపు

నాగ్‌పూర్‌లో అత్యవసర ల్యాండింగ్

జబల్‌పూర్: మధ్యప్రదేశ్‌లో జబల్‌పూర్ నుంచి ఆదివారం హైదరాబాద్‌కు బయలుదేరిన 6ఈ 7308 నంబర్ విమానానికి బాంబు బెదిరింపు రావడంతో దానిని నాగ్‌పూర్‌కు మళ్లించి అత్యవసర ల్యాండింగ్ చేశారు. విమానంలోని ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నట్టు ఇండిగో అధికారులు తెలిపారు. విమానంలో బాంబు స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు జరిపారు. అయితే ఎలాంటి బాంబు లేకపోవడంతో వట్టి బెదిరింపుగా నిర్ధారించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు ఆహార, పానీయాలు అందించినట్టు అధికారులు చెప్పారు.

'మోదీ క్షమాపణలో అహంకారాన్ని చూశారా?'

ముంబై (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో సింధుదుర్గ్‌లో ఛత్రపతి శివాజీ 35 అడుగుల విగ్రహం కూలిన ఘటనపై ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఇండియా కూటమి పార్టీలు జోడో మారో(చెప్పుతో కొట్టండి) పేరుతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. మహా వికాస్ అఘాడీ అగ్రనేతలు శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే, నానా పటోలే ఇందులో పాల్గొన్నారు. విగ్రహం కూలిపోయేలా నిర్మించి శివాజీని అవమానించిన వారికి గుణపాఠం చెప్పడమే లక్ష్యంగా ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే తెలిపారు. విగ్రహం కూలడంపై ప్రధాని మోదీ చెప్పిన క్షమాపణలోని అహంకారాన్ని గమనించారా? అని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి పనుల్లో జరుగుతున్న అంతులేని అవినీతికి ఈ ఘటనే తార్కాణమని శరద్ పవార్ పేర్కొన్నారు.

మియాజాకీ

జపాన్ యానిమేటర్‌కు రామన్ మెగసెసె అవార్డు

మరో నలుగురికి కూడా...

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1: ఆసియన్ నోబెల్ ప్రైజ్‌గా భావించే రామన్ మెగసెసె అవార్డు 2024 సంవత్సరానికిగానూ ప్రముఖ జపాన్ యానిమేటర్ హయావో మియాజాకీని వరించింది. ఆయన స్పిరిటెడ్ వంటి చిత్రాలకు దర్శకత్వం వహించి ప్రశంసలు పొందారు. మరో ముగ్గురు వ్యక్తులకు, ఒక సంస్థకు ఈ అవార్డు దక్కింది. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేస్తామని అవార్డు నిర్వాహక కమిటీ తెలిపింది. వియత్నాం డాక్టర్ న్గుయెన్, మాజీ బౌద్ధ సన్యాసి కర్మ పుంట్‌షో, ఇండోనేషియాకు చెందిన ఫర్విజీ ఫర్వాన్‌కు అవార్డు లభించింది. అలాగే థాయ్‌లాండ్‌కు చెందిన రూరల్ డాక్టర్స్ మూమెంట్ సంస్థకు కూడా పురస్కారం దక్కింది.

అక్రమ నివాసితులకు 'వీసా ఆమ్నెస్టీ'

- ప్రకటించిన యూఏఈ ప్రభుత్వం
- నివాస స్థితి క్రమబద్ధీకరణకు అవకాశం
- జరిమానా చెల్లించకుండా దేశం విడిచి వెళ్లిపోవచ్చు

దుబాయ్, సెప్టెంబర్ 1: యూఏఈలో అక్రమంగా నివసిస్తున్న వారి కోసం అక్కడి ప్రభుత్వం రెండు నెలల వీసా ఆమ్నెస్టీ కార్యక్రమాన్ని ఈ నెల 1న ప్రారంభించింది. దీని ద్వారా అక్రమ నివాసితులెవరైనా తమ నివాస స్థితిని (రెసిడెన్సీ స్టేటస్) క్రమబద్ధీకరించుకోవచ్చు లేదా జరిమానా లేకుండా దేశం విడిచి వెళ్లిపోవచ్చు. ఈ నేపథ్యంలో భారత రాయబార కార్యాలయం(సీజీఐ) ఒక అడ్వైజరీ జారీ చేసింది. దాని ప్రకారం..

1. భారత్‌కు తిరిగి వెళ్లాలనుకొనేవారు ఎమర్జెన్సీ సర్టిఫికెట్(ఈసీ) కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. తమ నివాస స్థితిని క్రమబద్ధీకరించుకోవాలనుకొనేవారు స్వల్ప కాల పరిమితి పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
2. ఈసీ కోసం ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు. దుబాయ్‌లోని సీజీఐ, అవిర్ ఇమ్మిగ్రేషన్ సెంటర్‌లో సమాచార కేంద్రాలు ఏర్పాటవుతాయి. భారత రాయబార కార్యాలయంలోని సమాచార కేంద్రం ఈ నెల 2 నుంచి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పని చేస్తుంది.
3. దరఖాస్తుదారులు దరఖాస్తు సమర్పించిన మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య దుబాయ్‌లోని సీజీఐ నుంచి తమ ఈసీని తీసుకోవచ్చు.
4. దరఖాస్తుదారులు స్వల్ప కాల పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి దుబాయ్, నార్తర్న్ ఎమిరేట్స్‌లోని బీఎల్ఎస్ కేంద్రాలను ముందస్తు అపాయింట్‌మెంట్ అవసరం లేకుండా సంప్రదించవచ్చు. ఈ కేంద్రాలు అన్ని ఆదివారాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయి.
5. ట్రావెల్ డాక్యుమెంట్ సమాచారం కోసం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య 050-9433111 మొబైల్ నెంబర్‌లో సంప్రదించవచ్చు. ప్రతి రోజూ 24 గంటలు పనిచేసే పీబీఎస్‌కె హెల్ప్‌లైన్ 800-46342కు అయినా కాల్ చేయొచ్చు.

మాస్క్ ధరిస్తే నో ఎంట్రీ!

బెంగళూరులో మాల్స్ ముందు బోర్డులు

బెంగళూరు, సెప్టెంబర్ 1: మాస్క్ లేనిదే లోపలికి ప్రవేశం లేదు.. కొవిడ్ సమయంలో అన్ని షాపుల ముందు ఇలాంటి బోర్డులు కనిపించేవి. అయితే ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. మాస్క్ ధరిస్తే నో ఎంట్రీ అంటూ దుకాణాలు బోర్డులు పెడుతున్నాయి. బెంగళూరులో పలు సూపర్‌మార్కెట్లు, షాపింగ్స్ మాల్స్ ఎదుట ఇలాంటి బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఇటీవలి కాలంలో దొంగతనాలు పెరగడమేనని దీనికి కారణమని చెప్తున్నారు. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేసినప్పటికీ, చోరులు మాస్క్‌లు ధరిస్తుండటంతో వారిని గుర్తించలేకపోతున్నామని, అందుకే మాస్క్‌లతో వచ్చే వారిని అనుమతించడం లేదని కంగేరిలోని ఒక షాపింగ్ మాల్ యాజమాని తెలిపారు. ఇలా మాస్క్‌లు ధరించి చిన్నచిన్న దొంగతనాలు చేసేవారిని పట్టుకోవడం కూడా కష్టమని ఒక పోలీస్ అధికారి చెప్పారు. ఇటీవల రామేశ్వరం కేఫ్‌లో జరిగిన బాంబు పేలుడులో కూడా నిందితుడు మాస్క్ ధరించే ఉన్నాడని, దొంగలకు ఇదొక యూనిఫాంగా మారిందని ఆయన పేర్కొన్నారు.



గంటలో మెదడు క్యాన్సర్ గుర్తించే రక్తపరీక్ష

న్యూఢిల్లీ: గ్లియోబ్లాస్టోమా అనే ప్రాణాంతక మెదడు క్యాన్సర్‌ను మొదట్లోనే కనిపెట్టగల కొత్త రక్త పరీక్షను పరిశోధకులు అభివృద్ధి చేశారు. యూనివర్సిటీ ఆఫ్ నాట్రె డామ్ పరిశోధకులు రూపొందించిన ఈ పరికరం గంటలోనే ఫలితాన్ని వెలువరిస్తుంది. కేవలం 100 మైక్రో లీటర్ల రక్తం ఈ పరీక్షకు అవసరం. 'మా సాంకేతికత నిర్దిష్టంగా గ్లియోబ్లాస్టోమా కోసం కాదు, ప్రారంభ దశలోనే దాన్ని కనిపెట్టే పరీక్షలు లేకపోవడంతో దానితోనే ప్రారంభించడం సమంజసం' అని అధ్యయనానికి నేతృత్వం వహించిన ప్రొఫెసర్ చాంగ్ తెలిపారు. ఆటోమేటెడ్ పరికరంలో ఉండే ఒక చిన్న బయో చిప్ ఎలక్ట్రోకైనెటిక్ సెన్సర్‌ను ఉపయోగించి విద్యుత్తు సాయంతో ఈ పరీక్షను నిర్వహిస్తుంది.

ఊబకాయులకు గుండె జబ్బుల ముప్పు

ముగ్గురిలో ఇద్దరి మరణాలకు ఇదే కారణం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1: ఊబకాయుల్లో ప్రతి ముగ్గురిలో ఇద్దరి మరణాలకు గుండెజబ్బులే కారణమని తాజా అధ్యయనం వెల్లడించింది. గత నాలుగు దశాబ్దాల కాలంలో ప్రపంచవ్యాప్తంగా స్థూలకాయుల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువై ప్రస్తుతం 100 కోట్లకు చేరిన తరుణంలో ఈ అధ్యయనం జరిగింది. లావుగా ఉండటం వల్ల గుండె వైఫల్యం, ఆకస్మిక గుండె పోటు, ధమనుల గోడల్లో కొవ్వు, కొలెస్ట్రాల్ పేరుకొనే వ్యాధి, రక్తం గడ్డ కట్టే వ్యాధి, గుండె కొట్టుకోవడంలో అసమతుల్యత కలిగే ప్రమాదం ఉందని అధ్యయనం తెలిపింది. గుండె నిర్మాణం, పనితీరుపైనా స్థూలకాయం ప్రభావం చూపుతుందని చెప్పింది. పలు సాంక్రమిక వ్యాధులు రావడానికి స్థూలకాయం ఒక కారణమని.. వివిధ అవయవాలపైనా అధిక బరువు ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిప